క్లుప్తంగా

108 సేవలపై ఆరా


మందులను తనిఖీ చేస్తున్న డీఎం నవీన్

సరుబుజ్జిలి: ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా 108 సిబ్బంది పనిచేయాలని శ్రీకాకుళం డివిజన్ మేనేజర్ ఎల్.నవీన్ అన్నారు. మండల కేంద్రంలో గల 108 అంబులెన్స్‌ను గురువారం తనిఖీ చేశారు. అంబులెన్స్ పనితీరు, పరికరాలు, అత్యవసర మందులు, డ్యూటీ రికార్డులను పరిశీలించారు. ఈఎమ్‌టీ మునికోటి ఈశ్వరరావు, పైలెట్ ధవళ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన పేడాడ


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామ్మోహన్‌రావు

ఆమదాలవలస: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను ఆమదాలవలస నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కూటమి అభ్యర్థి విజయం పట్ల రామ్మోహన్‌రావును పవన్‌కల్యాణ్ అభినందించారు.

కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా


చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని టెక్కలి డీఆర్‌ఓకు గురువారం అందజేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతికంగా బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు సూర్యనారాయణ తెలిపారు.

సంఘ సేవకుడు టంకాల బాబ్జీ


బాబ్జీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామారావు, తదితరులు

నరసన్నపేట: ఉన్నత ఆశయాలతో సమాజాభివృద్ధికి టంకాల బాబ్జీ ఎంతగానో కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు అన్నారు. టంకాల బాబ్జీ జయంతి, వర్ధంతి సందర్భంగా స్థానిక గోరువాని చెరువు గట్టుపై ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. బాబ్జీ సేవలను కొనియాడారు. ఉప్పు లింగరాజు, ఇట్రాజు సూరిబాబు, మార్పు విజయకుమార్, పొట్నూరు సాయిప్రసాద్, సదాశివుని కృష్ణ, టంకాల గౌతం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి


ప్రచారం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు

సారవకోట: ప్రీ స్కూల్ వయస్సు గల పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరుతూ సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు గురువారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సారవకోట మండల కేంద్రం పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, విద్యాబోధన తదితర అంశాలను వివరించారు. సూపర్‌వైజర్లు సుజాత, సుమలత, పద్మ, సునీత పాల్గొన్నారు.

సాగునీటి కాలువల పరిశీలన

సరుబుజ్జిలి: ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని టీడీపీ నాయకుడు కిల్లి లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో జరుగుతున్న నడింబట్టి, మురగడబట్టి సాగునీటి కాలువల పనులను గురువారం పరిశీలించారు. బాగుచేసిన కాలువల్లో చెత్త వేయకుండా గ్రామస్తులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష


పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతి మిగులు సీట్లుకు ప్రవేశ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. 40 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 7వ తరగతికి 23 మంది, 8వ తరగతికి 9 మంది, 9వ తరగతికి 8 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజయ్యారని ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి తెలిపారు. ఇంటర్‌మీడియెట్‌లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

\- పాతపట్నం

డైరీ ఆవిష్కరణ


నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం డైరీని గురువారం ఆవిష్కరించారు. ఈ విద్యా సంవత్సరంలో ఫిజికల్ సైన్స్‌లో విద్యా బోధనకు సంబంధించిన వివరాలు పొందుపరచడం జరిగిందని ఫోరం ప్రతినిధి సాయి శ్రీనివాస్ అన్నారు. ఈ డైరీని సైన్స్ టీచర్స్ ఫోరం ప్రత్యేకంగా ముద్రించిందన్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఉన్నత హెచ్‌ఎం వెంకటరావు మాట్లాడుతూ సైన్స్ టీచర్స్ ఫోరం ప్రతి ఏటా ఈ విధంగా డైరీ ముద్రించటంతో దాని ప్రకారం రోజు వారీ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎంతగానే ఉపకరిస్తుందన్నారు. మండలంలోని అన్ని హైస్కూళ్లకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

\- నరసన్నపేట

దోమల నివారణకు చర్యలు


దోమల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డి.ఎస్.ఆచారి సూచించారు. ఎల్.ఎన్.పేట మండలంలోని కేజీబీవీ, ఎస్సీ బాలుర వసతి గృహంలో దోమల నివారణ మందును గురువారం పిచికారీ చేశారు. వేసవి సెలవుల అనంతరం ఆయా హాస్టల్స్ తెరుచుకున్నందున దోమల నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు ఉంటున్న గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు పి.ప్రియాంక, వైద్య, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ బెండి జనార్దనరావు, కేజీబీవీ ఎస్‌ఓ ఎం.వి. అంబిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

\- ఎల్.ఎన్.పేట

రోడ్ టెర్రర్!


కొత్తకోట జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదం (ఫైల్)

- తరచూ ప్రమాదాలు
- కనీస చర్యలు చేపట్టని అధికారులు

సరుబుజ్జిలి: ప్రతిఏటా ప్రమాదాలు జరగకుండా భద్రత వారోత్సవాలు చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నా.. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు...

రహదారుల్లో రోజువారీ తనిఖీలు చేయకపోవడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల నడుపున్న డ్రైవర్ల వద్ద ఎటువంటి ధ్రువపత్రాలు ఉండడం లేదు. అనుభవంలేని డ్రైవర్లు, పట్టపగలే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. కొన్ని వాహనాలకు ఎటువంటి ఫిటెనెస్ లేకపోయినప్పటికీ మితిమీరిన జనాలతో ప్రయాణాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో 18 ఏళ్లలోపు వయస్సు కంటే తక్కువ ఉన్న వారే మృతి చెందుతున్నారు. సరదా కోసం వాహనాలు నడిపి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టి


తరచూ ప్రమాదాలు జరిగే పొన్నాంపేట మలుపు


పాలవలస వద్ద జరిగిన ప్రమాదం (ఫైల్)

విలువైన ప్రాణాలు పోవడానికి కారకులుగా మారుతున్నారు. సరదా కోసం చేసిన డ్రైవింగ్ ఎన్నో కుటుంబాల జీవితాలను తారుమారు చేస్తుంది.

హెచ్చరిక బోర్డులు ఎక్కడ?

రహదారుల్లో స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలేదు. ముఖ్యంగా మలుపులు, జంక్షన్లు, స్కూల్‌జోన్లు, ఇరుకైన బ్రిడ్జీలు ఉన్న చోట్ల బోర్డులు ఏర్పాటు చేయాలి. రేడియమ్ స్టిక్కర్ల బోర్డులు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ట్రాఫిక్ రూల్స్ గాలికి..

ప్రధానంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలేదు. ఇంటి పనులకు సంబంధించిన ఇనుప చువ్వలు, రాడ్లను ఆటోలు, ట్రక్కర్లపై వేసి ఎటువంటి ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వాహనం తీస్తే భయమేస్తుంది


రహదారిపై వాహనం తీస్తే భయమేస్తుంది. ఎవరు ఏ వైపు నుంచి వచ్చి ఢీకొడతారన్న భయంతో వణికిపోతున్నాం. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని అధికారులు అరికట్టాలి.

\- గుంట విజయ్, ప్రయాణికుడు, ఏఎల్‌నగరం

శిక్షలు కఠినంగా ఉండాలి


ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారు ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలి. నిబంధనలు ఉల్లంఘించినవారి వాహన లైసెన్స్, రిజిస్ట్రేషను రద్దుచేయాలి. శిక్షలు కఠినంగా ఉంటేనే ప్రమాదాలు తగ్గుతాయి.

\- వండాన కృష్ణ, సామాజిక సేవాకర్త, రావివలస

బోర్డులు ఏర్పాటు చేసున్నాం

రహదారుల్లో రాత్రి వేళల్లో ఇబ్బందులు లేకుండా రేడిఎం బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తులు వాటిని పాడుచేస్తున్నారు. రద్దీగా ఉన్న జంక్షన్ల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. పోలీస్‌వారి సహకారంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

\- ఆంజనేయనాయక్, జేఈ, ఆర్‌అండ్‌బీ, సరుబుజ్జిలి

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తీశారు. సర్పంచ్ కె.వాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వైకుంఠరావు పర్యవేక్షించారు.


పూడికలు తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఉపాధ్యాయులకు సత్కారం

కొత్తూరు: పదో తరగతిలో శత శాతం ఫలితాలు సాధనకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేశారని కడుము జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గొర్లె తిరుమలరావు అన్నారు. గురువారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మండలంలోని కడుము పాఠశాల రెండో స్థానంలో నిలిచిందన్నారు. హిందీ సబ్జెక్ట్‌లో శత శాతం ఉత్తీర్ణత రావడంతో హిందీ ఉపాధ్యాయురాలు వనీలను సత్కరించారు హెచ్‌ఎంతోపాటు పలువురు ఉపాధ్యాయులను సిబ్బంది సన్మానించారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మిశ్రో

ఎల్.ఎన్.పేట: ఉన్నత విలువలతో కూడిన విద్యను నేర్చుకునేందుకు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, లైన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.కె. మిశ్రో అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి వారి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివించటం వల్ల కలిగే అనేక ప్రయోజనాలను తెలియజేశారు. ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరుద్ర, సంగీత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై పని భారం తగ్గించాలని, ముఖ్యంగా మహిళా కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. కార్పొరేషన్ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐలో టెక్నికల్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పుష్ కార్ట్ వెహికల్స్, విల్ బార్ వెహికల్స్ మరమ్మతులకు గురికావడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సకాలంలో పనిముట్లు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతిరావు, కళ్యాణి అప్పలరాజు, పార్థసారథి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

16న మండల సమావేశం

సారవకోట: ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రాంబాబు గురువారం తెలిపారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టనున్నారు. విద్యుత్ శాఖ ఏఈ సత్తారు బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియా, వెంగళరావు కాలనీలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, వెంకయ్యపేట, లక్ష్ముడుపేటలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

15న గాయత్రీ కళాశాలలో జాబ్‌మేళా

శ్రీకాకుళం రూరల్: మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ర్యాండ్స్ పేటీయం, నవతా ట్రాన్స్‌పోర్టు వంటి సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్టమర్ సర్వీస్ వంటి ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తామని తెలిపారు. బీఎస్సీతో పాటు అన్ని గ్రూపుల వారు పాల్గొనవచ్చన్నారు.

18న శ్రీకూర్మం గ్రామదేవత ఉత్సవం

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామదేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి పండుగ ఈ నెల 18న నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మంగళవారం దేవరను తీసుకురావటంతో ఉత్సవం ప్రారంభమైందని, 18న అనుపు ఉత్సవంలో భాగంగా విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మహిళలంతా మేళతాళాల నడుమ అమ్మవారి ఆలయానికి వెళ్లి ముర్రాటలు సమర్పిస్తారని తెలిపారు.


మోహినీ భద్రాంబిక అమ్మవారు

పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు సరఫరా


సరుబుజ్జిలి: వ్యాన్‌లో కిట్లను తరలిస్తున్న ఎంఈఓలు

సారవకోట: స్థానిక ఎమ్మార్సీ నుంచి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం స్టూడెంట్ కిట్లు సరఫరా చేశారు. పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కావడంతో నోట్, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు ప్రత్యేక వాహనాల్లో అన్ని పాఠశాలలకు తరలించారు. ఎంఈఓలు ఎం.వి.రమణ, కె భూలక్ష్మి పర్యవేక్షించారు.

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని ఎంఈఓలు డి.బాలరాజు, కె.శ్రీనివాసరావు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి మండల కేంద్రానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలను గురువారం అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, సీఆర్‌ఎమ్‌టీలు చిన్నారావు, చిరంజీవి, రామినాయుడు, రోహిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సారవకోట: మినీ ఆటోలో కిట్లను తరలిస్తున్న దృశ్యం

కొలతల మేరకు ఉపాధి పనులు చేయాలి

మెళియాపుట్టి: మండల స్థాయిలో నిర్దిష్ట వేతనం తగ్గకుండా కొలతల ప్రాప్తికి పనులు చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమీక్షించారు. పనులు వేగవంతం చేయాలని, మండల వ్యాప్తంగా నిర్దేశించిన లక్ష్యాల్లో భాగంగా ఇంకా 60 వేల పైచిలుకు పని దినాలు ఇంకా చేయాల్సి ఉందన్నారు. సామాజిక తనిఖీల్లో సిబ్బందికి వచ్చిన రికవరీలు వెంటనే యాజమాన్య సంస్థ ఖాతాకు జమ చేయాలని, లేదంటే జీతాల్లో రికవరీ చేస్తామని హెచ్చరించారు. వర్షా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా మొక్కలు నాటడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, పలువురు సాంకేతిక, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు

విద్యార్థుల బడిబాట


జెడ్పీహెచ్ఎస్ (బోర్డు) స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఆనందంగా హాజరయ్యారు. మండలంలోని 83 స్కూళ్లు గురువారం తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ బాధ్యతగా సమయవేళలు పాటించాలన్నారు. గ్రామాల్లో ప్రచారం చేపట్టాలన్నారు. నరసన్నపేట టౌన్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ బోర్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

చోరీలపై అప్రమత్తం


మాట్లాడుతున్న ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్

బూర్జ: విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు, ముఖ్యమైన వస్తువులు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్ తెలియజేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం స్థానిక ఎస్సై జి.వి ప్రసాద్ ఆధ్వర్యంలో విలేకర్లతో మాట్లాడారు. ఆరుబయట బైట నిద్రిస్తున్నప్పుడు విలువైన ఆభరణాలు ఇంట్లో భద్రపర్చుకోవాలన్నారు. రాత్రి వేళల్లో ఇంటికి తాళాలు వేయాలన్నారు. గ్రామాల్లో పగలు, రాత్రీ గస్తీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పగటిపూట అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం తెలియజేయాలన్నారు.

ఇప్పటివరకు నమోదైన చోరీ కేసులపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగతనాలకు పాల్పడిన వారిని పట్టుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు

కొత్తూరు: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దని ఎంఈఓ గోవిందరావు ఆదేశించారు. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విద్యార్థులకు మాత్రమే బోధన చేయాలన్నారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. పుస్తకాలను అధిక రేట్లుకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.